సాక్షి
వైఎస్‌ఆర్‌ జిల్లా
శనివారం । 10 । ఆగస్టు । 2024



టీడీపీ బడితెగింపు
రాజకీయాలకు అతీతంగా నిర్వహించాల్సిన స్కూల్‌ మేనేజ్‌మెంట్‌ కమిటీ (ఎస్‌ఎంసీ) ఎన్నికల్లోనూ తెలుగుదేశం పార్టీ బరి తెగించింది. -8లో

● మోడీతో జోడీ కట్టి..
● ముస్లింలపై రుబాబు ● బట్టబయలైన సీఎం కపటప్రేమ
● మండిపడుతున్న మైనారిటీలు

వక్ఫ్‌ బిల్లుకు జైకొట్టి!

చంద్రబాబు ముసుగు తొలగింది. ముస్లింలకు అండగా ఉంటానన్న ఆయన మాటలు నీటిపై రాతలేనని పార్లమెంట్‌ సాక్షిగా రుజువైంది. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వక్ఫ్‌ సవరణ బిల్లుకు ఏకపక్షంగా మద్దతివ్వడంతో బాబు నిజస్వరూపం బట్టబయలైంది. లౌకిక రాజ్యాంగానికి తూట్లు పొడుస్తున్న బీజేపీతో జత కూడినప్పుడే బాబు తీరుపై ముస్లింలలో అనుమానం కలిగింది. తాజా వక్ఫ్‌ సవరణ బిల్లుకు ఆమోదం తెలపడంతో ఆ అనుమానం నిజమైంది. బాబు కూడా ఆ తాను ముక్కేనని... తాను నడిచేది ఆ'కాషాయ' ఛాయల్లోనేనని తెలిసిపోయింది.



సాక్షి ప్రతినిధి, కడప: కేంద్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం తీసుకొచ్చిన వక్ఫ్‌ సవరణ బిల్లును టీడీపీ ఏకపక్షంగా మద్దతివ్వడంపై ముస్లింలు భగ్గుమంటున్నారు. ముస్లింలకు తోడుగా ఉంటానంటూనే మోదీకి తోడై .. తోడేళ్ల పన్నాగం పన్నుతావా అంటూ ధ్వజమెత్తుతున్నారు. వక్ఫ్‌ ఆస్తులకు రక్షణగా ఉంటామంటూనే 'ఉఫ్‌'మని లాగేసేందుకు నక్కజిత్తుల ఎత్తులేస్తున్నారా అంటూ మండిపడుతున్నారు. మరో వైపు పార్లమెంట్‌లో వక్ఫ్‌ సవరణ బిల్లును వైఎస్సార్‌సీపీ తీవ్రంగా వ్యతిరేకించడంతో ముస్లింలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వైఎస్‌ జగన్‌ ఎప్పుడూ ముస్లింల పక్షపాతేనని కొనియాడుతున్నారు. వక్ఫ్‌ సవరణ బిల్లును పూర్తిగా ఆపేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్‌ చేస్తున్నారు. మైనార్టీలకు ఏ కష్టమొచ్చినా.. ఏ నష్టం జరిగినా అండగా ఉంటామంటూ చెప్పిన టీడీపీ, జనసేన పార్టీలు ఇలాంటి బిల్లుకు ఎలా మద్దతిస్తారని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా రెండు నాల్కల ధోరణిని మానుకోవాలని హితవు పలుకుతున్నారు.

టీడీపీకి బుద్ధి చెబుతాం

ముస్లింలను మోసం చేసే వక్ఫ్‌ బోర్డు చట్ట సవరణ బిల్లుకు తెలుగు దేశం, జనసేన మద్దతు ఇవ్వడం చారిత్రాత్మక తప్పిదం. వచ్చే స్థానిక సంస్థ ఎన్నికల్లో కూటమికి బుద్ధి చెపుతాం. –అలమూరు రఫీ, రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు, ముస్లిం హక్కుల పోరాట సమితి

వక్ఫ్‌బోర్డు ఆస్తులు కాజేయడానికే సవరణలు

మైనార్టీలకు సంబంధించిన వక్ఫ్‌బోర్డు ఆస్తులు కాజేయడానికే కేంద్రం 40 సవరణలు చేస్తూ పార్లమెంట్‌లో బిల్లు పెట్టింది. ఇండియా కూటమిలోని ప్రతిపక్షాలతోపాటు రాష్ట్రంలోని వైఎస్సార్‌సీపీ వ్యతిరేకించడం హర్షించదగ్గ విషయం. మైనార్టీలకు ఏం కష్టమొచ్చినా, ఏ నష్టం జరిగినా అండగా ఉంటామని ఎన్నికల ముందు అధికార టీడీపీ, జనసేన పార్టీలు ప్రగల్భాలు పలికాయి. అయితే పార్లమెంట్‌లో ముస్లింలకు నష్టం కలిగించే వక్ఫ్‌ సవరణ బిల్లును బీజేపీ ప్రభుత్వం ప్రవేశపెడితే టీడీపీ. జనసేన పార్టీలు సమర్ధిస్తూ మద్దతు పలకడం శోచనీయం – సలీం, మూమెంట్‌ ఫర్‌ పీస్‌ అండ్‌ జస్టిస్‌ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ప్రొద్దుటూరు

సమాఖ్య వ్యవస్థపై దాడి

కేంద్ర ప్రభుత్వ తెచ్చిన వక్ఫ్‌ సవరణ బిల్లు తీసుకు రావడం సమాఖ్య వ్యవస్థపై దాడి చేయడమే. దేశంలో మత స్వేచ్ఛను బీజేపీ ప్రభుత్వ కాలరాస్తోంది. కేంద్ర ప్రభుత్వం వెంటనే ఈ బిల్లును వెనక్కు తీసుకోవాలి – షేక్‌ ఇమాం బాషా, న్యాయవాది దువ్వూరు

మోసం.. బాబు నైజం

వక్ఫ్‌ ఆస్తుల చట్ట సవరణ రాజ్యాంగ విరుద్ధం. ఈ బిల్లుకు టీడీపీ మద్దతు ప్రకటించడం అన్యాయం. ముస్లింలను ఓట్ల కోసం వాడుకొని వదిలేయడం ఆయన నైజం. తెలుగుదేశం ప్రభుత్వానికి గుణపాఠం చెబుతాం. – దస్తగిరి, రాష్ట్ర అధ్యక్షుడు, మైనార్టీ రైట్స్‌ ఫోరం

టీడీపీ, జనసేన తీరు సరికాదు

పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన వక్ఫ్‌ సవరణ బిల్లుకు అధికార టీడీపీ, జనసేన మద్దతివ్వడం సరికాదు. కాంగ్రెస్‌, ఇతర ప్రతిపక్షాలు, రాష్ట్రంలోని వైఎస్సార్‌సీపీ వ్యతిరేకించడంవల్ల ఈ బిల్లుపై కేంద్రం వెనక్కు తగ్గింది. – షఫీ, ఐడియల్‌ యూత్‌ మూమెంట్‌ పట్టణ ప్రధాన కార్యదర్శి, ప్రొద్దుటూరు

మైనార్టీలపై బీజేపీ విద్వేషం

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దేశంలోని మైనార్టీలపై మత విద్వేషాలను చూపుతోంది. ప్రధాని మోడీ రాజ్యాంగ ప్రమాణాన్ని ఉల్లంఘిస్తూ మత విద్వేష పాలన కొనసాగిస్తున్నారు. టీడీపీ ఎంపీలు మద్దతు ఇవ్వడాన్ని ఖండిస్తున్నాం. –పఠాన్‌ మహమ్మద్‌ అలీ ఖాన్‌, ఆంధ్రప్రదేశ్‌ కాంగ్రెస్‌ కమిటీ మైనార్టీ ఉపాధ్యక్షుడు

చట్ట సవరణ బిల్లు దారుణం

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వక్ఫ్‌ బోర్డు ఆస్తుల చట్ట సవరణ బిల్లు తీసుకురావడం దారుణం. వక్ఫ్‌ బోర్డు ఆస్తులను చట్ట సవరణ చేయకుండా పార్టీలకు అతీతంగా అడ్డుకోవాలన్నారు. బీజేపీ ప్రభుత్వం ముస్లింలపై టార్గెట్‌ చేస్తోంది. వక్ఫ్‌ బోర్డు ఆస్తులను చట్ట సవరణ చేస్తే ఉద్యమాలు చేపడతాం. – సలావుద్దీన్‌, కాంగ్రెస్‌ నాయకుడు


ఏకపక్ష నిర్ణయం తగదు

వక్ఫ్‌ చట్టాన్ని సవరణలు చేసేందుకు కేంద్రం ఏకపక్ష నిర్ణయం తీసుకోవడం హేయం. సవరణ చేయాలన్న ఉద్దేశముంటే వక్ఫ్‌ కౌన్సిల్‌ ఆఫ్‌ ఇండియా, ముస్లిం సంఘాలతో పాటు రాష్ట్రాల వక్ఫ్‌ బోర్డుకు ఆ బిల్లు ప్రతుల్ని పంపించి అభిప్రాయాలు తీసుకోవాలి. – మక్బూల్‌బాషా, రాష్ట్ర కార్యదర్శి, ఆప్‌ కీ ఆవాజ్‌ సంస్థ, కడప

టీడీపీ మద్దతివ్వడం దుర్మార్గం

వక్ఫ్‌ ఆస్తులను కాజేసేందుకు ఎన్‌డీఏ ప్రభుత్వం పార్లమెంటులో బిల్లు తీసుకువస్తే.. దానికి తెలుగుదేశం పార్టీ పార్లమెంట్‌ సభ్యులు మద్దతివ్వడం దుర్మార్గం. మైనారిటీల సంక్షేమం కోసం ఉపయోగించాల్సిన ఆస్తులను పక్కదారి పట్టించడం సవరణలలో దాగి ఉంది. – కేసీ బాదుల్లా, జిల్లా అధ్యక్షులు ఇన్సాఫ్‌ జిల్లాసమితి, కడప

అధికారంలోకి రావడమే ఆలస్యం వారిలో అణువణువునా అహంకారమే నిండిపోయింది... ఒళ్లంతా విషంగా మారింది. కళ్ల నిండా పైత్యం చేరింది. ఇంకేముంది నరనరాన 'నారో'న్మాదం నింపుకున్న పచ్చ మూకలు రెచ్చిపోతున్నారు. మంచీ చెడు మరచి రాష్ట్రాన్ని కాష్టంగా మార్చారు. ఏపీలో అంబేడ్కర్‌ రాజ్యాంగానికి చోటే లేదంటూ.. ఇక్కడ రెడ్‌బుక్‌ రాజ్యాంగమే నడవాలంటూ అధికారులకు హుకుం జారీ చేస్తున్నారు. రాత్రింబవళ్లు తేడా లేకుండా దాడులకు తెగబడుతూ ఉన్మాదుల్లా మారారు. చివరికి రాజ్యాంగ నిర్మాత డాక్టర్‌ బీఆర్‌ అంబేడ్కర్‌ విగ్రహంపైనే దాడి చేసే దుస్సాహసానికి ఒడిగట్టారు. సైకోయిజానికి మారుపేరుగా నిలిచారు. విజయవాడలోని అంబేడ్కర్‌ సామాజిక న్యాయ మహాశిల్పంపై తెలుగుతమ్ముళ్లు చేసిన దాడిని ప్రతి ఒక్కరూ ఖండిస్తున్నారు.



పచ్చ మూకల దాడిలో ధ్వంసంమైన సామాజిక న్యాయ మహా శిల్పం బోర్డు, వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి పేరు

నారోన్మాదం



బద్వేలు: అంబేడ్కర్‌ విగ్రహం ఎదుట నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలియజేస్తున్న ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే తదితరులు

దాడి దారుణం

రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్‌ అంబేడ్కర్‌ సామాజిక న్యాయ మహా శిల్పంపై దాడి చేయడం హేయమైన చర్య. మహారాష్ట్ర లోని నాగపూర్‌లో 1930 ఆగస్టు 8న ఏర్పాటైన మహాసభకు దళితుల ఆరాధ్య దైవమైన అంబేడ్కర్‌ అధ్యక్షత వహించిన రోజునే రాజ్యాంగ రూపశిల్పిపై దాడి జరగడం దారుణం. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. ఈ ఘటనకు కారణమైన వారికి కఠినంగా శిక్షించాలి. –సీ.వెంకట నారాయణ, ఎమ్మార్పీఎస్‌ రాష్ట్ర కార్యదర్శి, దువ్వూరు

అంబేడ్కర్‌ విగ్రహం తొలగించే కుట్ర

మాజీ ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌ హయాంలో ఏర్పాటు చేసిన డాక్టర్‌ బీఆర్‌ అంబేడ్కర్‌ విగ్రహాన్ని తొలగించేందుకు టీడీపీ ప్రభుత్వం కుట్ర చేస్తోంది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పటైనప్పటి నుంచి దళితులపై దాడులు చేయడం, భూములు లాక్కోవడం జరుగుతోంది. దేశంలోనే ఎత్తైన అంబేడ్కర్‌ విగ్రహాన్ని ఉన్నతాశయంతో జగన్‌ ఏర్పాటు చేశారు. మా దళిత జాతికి చెందిన హోంశాఖ మంత్రి 48 గంటల్లో వారిని అరెస్టు చేయకపోతే ఉద్యమాలు చేస్తాం. – గోసా మనోహర్‌, జాతీయ మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు

ఇది యావత్‌ దేశానికే అవమానం

భారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌ విగ్రహానికే రక్షణ లేకపోతే ఇక సామాన్య ప్రజలకు రక్షణ ఎక్కడ . వైఎస్‌ జగన్‌ రూ. 400 కోట్లకు పైగా ఖర్చుతో సర్వాంగ సుందరంగా అంబేడ్కర్‌ విగ్రహం ఆవిష్కరించారు. అలాంటి విగ్రహాన్ని ధ్వంసం చేసేందుకు యత్నించిన వారు ఎంతటి వారినైనా కఠినంగా శిక్షించాలి. ఇది యావత్‌దేశానికే మాయని మచ్చ. –ముడియం చిన్ని. డీవైఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు

దళితులపై చిన్న చూపు

టీడీపీ ప్రభుత్వానికి దళితులంటే తొలి నుంచి చిన్న చూపే. సీఎం చంద్రబాబు తన హయాంలో ఎన్నడూ రాజ్యాంగ నిర్మాత బీఆర్‌ అంబేడ్కర్‌ విగ్రహాన్ని పెట్టాలన్న ఆలోచన చేయలేదు. పెట్టిన తర్వాత ఏ ప్రభుత్వం అయినా ఆయన విగ్రహాన్ని గౌరవించాల్సిందే. ఈ ప్రభుత్వంలో విగ్రహానికి తొలగించడానికి కుట్ర జరిగిందంటే ఎవరు కారకులు. – రామాజి ఇమ్మానుయేల్‌, రాష్ట్ర మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు.

భద్రత కల్పించాలి

విజయవాడ నగర నడిబొడ్డున ఏర్పాటు చేసిన బీఆర్‌ అంబేడ్కర్‌ విగ్రహానికి ప్రభుత్వం ప్రత్యేక భద్రత కల్పించాలి. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ఆయన ఎంతగానో శ్రమించారు. ఆయన రాసిన రాజ్యాంగం వల్లే నేడు అందరూ హక్కులు అనుభవిస్తున్నారు. – సుధాకర్‌ మాదిగ, ఏపీ ఎమ్మార్పీఎస్‌ రాష్ట్ర అధికార ప్రతినిధి

అంబేడ్కర్‌ విగ్రహంపై దాడి సిగ్గుచేటు

గత ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్మోహన్‌రెడ్డి దేశానికే తలమానికంగా విజయవాడలోని స్వరాజ్య మైదానంలో భారీ అంబేడ్కర్‌ విగ్రహం ఏర్పాటు చేశారు. ఆ మహనీయుడి విగ్రహంపైనే టీడీపీ నేతలు దాడి చేయడం సిగ్గుచేటు. దాడికి పాల్పడిన వారిని శిక్షించాలి. –ముత్యాలప్రసాద్‌, జెడ్పీటీసీ, పోరుమామిళ్ల

న్యూస్‌రీల్‌

ఎస్‌ఎఫ్‌ఐ నూతన జిల్లా కమిటీ ఎన్నిక



ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన రాహుల్‌ | జిల్లా కార్యదర్శిగా ఎన్నికైన వీరపోగు రవి

కడప వైఎస్‌ఆర్‌ సర్కిల్‌: ఈ నెల 8న జరిగిన జిల్లా ఎస్‌.ఎఫ్‌.ఐ ప్లీనరీ సమావేశంలో 17 మందితో నూతన కమిటీ ఎన్నుకున్నామని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శి అశోక్‌ కుమార్‌ తెలిపారు. జిల్లా అధ్యక్షుడిగా ఎద్దుల రాహుల్‌, జిల్లా కార్యదర్శి వీరపోగు రవిని ఎన్నుకున్నట్లు వివరించారు. ఎస్‌.ఎఫ్‌.ఐ నూతన జిల్లా ఉపాధ్యక్షులుగా సునీల్‌ కుమార్‌, రాజశేఖర్‌ రెడ్డి సహాయ కార్యదర్శులుగా అజయ్‌ కుమార్‌, మనోజ్‌ 17 మందితో కూడిన జిల్లా కమిటీ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకయ్యారన్నారు. కాగా సమావేశంలో వివిధ సమస్యల మీద తీర్మానాలు ఆమోదించుకొని భవిష్యత్తు ఉద్యమానికి దిశానిర్దేశం చేసుకున్నారు.

ఎఫ్‌ఆర్‌టీఐ జిల్లా అధ్యక్షుడిగా తిరుమలరెడ్డి



తిరుమలరెడ్డిని అభినందిస్తున్న ఆర్‌టీఐ ప్రతినిధులు

కడప సెవెన్‌రోడ్స్‌: ఫోరం ఫర్‌ ఆర్‌టీఐ జిల్లా శాఖ అధ్యక్షుడిగా చక్రాయపేట మండలానికి చెందిన ఎం.తిరుమలరెడ్డి నియమితులయ్యారు. ఆర్‌టీఐ జాతీయ అధ్యక్షుడు చంద్రమోహన్‌ ఆదేశాల మేరకు జాతీయ కార్యదర్శి ప్రసన్న కుమార్‌ ఇందుకు సంబంధించిన నియామక ఉత్తర్వులు శుక్రవారం అందజేశారు. జిల్లాలో ఆసక్తి ఉన్న వారు ఆర్‌టీఐలో సభ్యత్వం తీసుకోవాలని కోరారు.

నేడు గండిలో తొలి శనివారోత్సవం



విద్యుద్దీపాల అలంకరణలో గండి అంజన్న ఆలయం



గండి వీరాంజనేయ స్వామి మూలవిరాట్‌

చక్రాయపేట: పవిత్ర పుణ్యక్షేత్రమైన గండిలో శ్రావణ మాస ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. నేడు తొలి శ్రావణమాస ఉత్సవం జరుగనుంది. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు.ప్రాంగణంలో పలు దేవతా మూర్తుల డిజిటల్‌ కటౌట్లను ఏర్పాటు చేశారు. వీఐపీ పాసులు ఉన్న వారికి ఉదయం 5నుంచి 8గంటల వరకు, సాయంత్రం 5నుంచి 8గంటల వరకు మాత్రమే అనుమతి ఉంటుందని ఆలయ అధికారి తెలిపారు. ఈవిషయాన్ని భక్తులు గమనించాలని కోరారు. గండి ఉత్సవాల సందర్భంగా ఆలయ ఆవరణంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేసినట్లు ట్రిపుల్‌ ఐటీకి చెందిన ప్రసాద్‌ తెలిపారు.ముందుగా పేరు నమోదు చేసుకోవాలనుకున్న వారు 8106473271 నంబరుకు ఫోన్‌ చేయాలని కోరారు.

భారీ బందోబస్తు ఏర్పాటు: శ్రావణ మాసం సందర్భంగా తొలి శనివారం గండి అంజన్న సన్నిధిలో జరిగే ఉత్సవాలకు పెద్ద ఎత్తున బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఆర్కే వ్యాలీ సీఐ గోవిందరెడ్డి తెలిపారు. పులివెందుల డీఎస్పీ మురళి ఆధ్వర్యంలో సుమారు 130 మంది పోలీసులు, పోలీసు అధికారులు బందోబస్తులో పాల్గొంటున్నట్లు చెప్పారు లారీలను సాయంత్రం వరకు అద్దాలమర్రి క్రాస్‌,ఇడుపులపాయ క్రాస్‌ల వద్దనే ఆపేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఆర్కే వ్యాలీ ఎస్సై రంగారావు పాల్గొన్నారు.

ఆదివాసీల కోసం సంక్షేమ పథకాలు

కలెక్టర్‌ శివశంకర్‌

కడప సెవెన్‌రోడ్స్‌: అడవినే నమ్ముకుని జీవించే ఆదివాసీ గిరిజనుల సంక్షేమం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నో పథకాలు అమలు చేస్తున్నాయని కలెక్టర్‌ శివశంకర్‌ తెలిపారు. ఆ పథకాలు అందించి వారి జీవితాల్లో గుణాత్మక మార్పుకు దోహదపడాలని అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌ గ్రీవెన్స్‌సెల్‌ హాలులో నిర్వహించిన ప్రపంచ ఆదివాసీ దినోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గిరిజనుల్లో విద్యాభివృద్ధికి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఔత్సాహిక గిరిజనులకు పరిశ్రమల్లో రాణించేందుకు రాయితీలు కల్పిస్తున్నామన్నారు. జమ్మలమడుగు శాసనసభ్యులు సి.ఆదినారాయణరెడ్డి మాట్లాడారు. తొలుత కొమరం భీమ్‌, ఏకలవ్యుడు, సంత్‌ సేవాలాల్‌ మహరాజ్‌, మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు, అంబేడ్కర్‌ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా ట్రైబల్‌ సంక్షేమ శాఖ ఇన్‌ఛార్జి అధికారి సరస్వతి, డీఆర్‌డీఏ,మెప్మా పీడీ లు ఆనంద్‌ నాయక్‌, సురేష్‌రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్‌ శివశంకర్‌

మొక్కల పెంపకం అందరి బాధ్యత

మొక్కలను పెంచి పచ్చదనాన్ని పంచే కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా స్వీకరించాలని జిల్లా కలెక్టర్‌ శివశంకర్‌ లోతేటి పిలుపునిచ్చారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో జేసీ అదితి సింగ్‌, డీఎఫ్‌ఓ సందీప్‌ రెడ్డిలతో కలిసి.. జిల్లాలో వనమహోత్సవం నిర్వహణా కార్యాచరణపై జిల్లా కలెక్టర్‌ సంబంధిత శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. సామాజిక అటవీ విభాగం డీఎఫ్‌ఓ నాగార్జున రెడ్డి, డ్వామా పిడి జోయల్‌ విజయ్‌ కుమార్‌, డీఈవో అనురాధ పాల్గొన్నారు.

నాటుసారాను అరికట్టండి

జిల్లాలో మద్యం పాలసీలో పారదర్శకత పాటించేలా చర్యలు చేపట్టాలని, జిల్లాలో సారా తయారీ ఎక్కడా జరగకూడదని కలెక్టర్‌ శివశంకర్‌ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో జిల్లాలో నవోదయం పేస్‌-2.0 కార్యక్రమ కార్యాచరణపై కలెక్టర్‌ శివశంకర్‌ సమీక్షా సమావేశం నిర్వహించారు.

గడువు లోపు లక్ష్యం చేరండి

నిర్దేశిత గడువులోపు గృహనిర్మాణ లక్ష్యాన్ని సాధించడానికి ప్రతి ఒక్కరూ నిబద్ధతతో పని చేయాలని కలెక్టర్‌ అధికారులను ఆదేశించారు. శుక్రవారం హౌసింగ్‌ పీడీ క్రిష్ణయ్యలతో కలిసి గృహ నిర్మాణ పనుల పురోగతి, మౌలిక వసతులు తదితర అంశాలపై కలెక్టర్‌ సమీక్షించారు.

టీడీపీ బడితెగింపు

రాజకీయాలకు అతీతంగా నిర్వహించాల్సిన స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ(ఎస్‌ఎంసీ) ఎన్నికల్లోనూ టీడీపీ బరి తెగించింది. దౌర్జన్యాలు బెదిరింపులకు పాల్పడింది. పాఠశాలల్లో విద్యార్థుల అవస్థల గురించి ప్రశ్నించే ఎస్‌ఎంసీల్లో తమవారిని నియమించుకునే ఎత్తుగడ వేసింది. ఇకమీదట స్కూళ్లలో ఏమి జరిగినా ప్రభుత్వాన్ని నిలదీయకుండా ఉండేందుకు పక్కా స్కెచ్ వేసింది. పేదలకు ప్రభుత్వ విద్యను అందని ద్రాక్షగా మార్చేందుకు పన్నాగం పన్నింది. అధికారులను గుప్పిట్లో పెట్టుకుని ఈ తతంగమంతా నడిపింది. పోలీసులు ప్రేక్షకపాత్ర వహించడం తప్ప ఏమీ చేయలేకపోవడం గమనార్హం.

• వైఎస్‌ఆర్ జిల్లాలో ఎన్నికలు నిర్వహించిన పాఠశాలలు **1999** • ఏకగ్రీవంగా ఎన్నికైన పాఠశాలలు **1357** • ఎన్నికలు జరగనివి **52**

ఎస్‌ఎంసీ ఎన్నికల్లో పచ్చపెత్తనం

- విద్యాశాఖ అధికారులపై అధికారపార్టీ నేతల ఒత్తిళ్లు
- తమవారే చైర్మన్ అంటూ హుకుం

బ్రహ్మంగారిమఠం : బ్రహ్మంగారి మఠం మండలంలో 10 జెడ్పీహైస్కూల్, 50 మండల పరిషత్ పాఠశాలలు ఉన్నాయి. ఇందులో ఎద్దులాయపల్లె, గురుకుల పాఠశాలలో కోరం లేక ఎన్నికలు వాయిదా పడ్డాయి. పాఠశాల అభివృద్ధి కమిటీ ఎన్నికలు అధికారులకన్నా మండల టీడీపీ నాయకులు హంగామా చేశారు. మండల టీడీపీ అధ్యక్షుడు చెన్నుపల్లె సుబ్బారెడ్డికి ఎమ్మెల్యే పుట్టాసుధాకర్ యాదవ్ ఆదేశాలతో ఎన్నికల పర్యవేక్షణ ఆయన తీసుకున్నారు. అన్ని పాఠశాలలకు వెళ్లి అక్కడ తల్లిదండ్రులపై ఒత్తిడి తీసుకువచ్చాడు. ఏది ఏమైనా చైర్మన్లుగా మా పార్టీ సానుభూతి పరులుండాలి. కాదంటే పోలీసులను రంగంలోకి దింపుతా అంటూ తల్లిదండ్రులు, ప్రధానోపాధ్యాయులపై ఒత్తిడి తెచ్చి చైర్మన్, వైస్ చైర్మన్‌లను ఎన్నుకున్నారు.

మండలంలోని గొడ్లవీడు పంచాయతీ పీసీ పల్లె జెడ్పీహైస్కూల్‌లో జరిగిన కమిటీ ఎన్నికల్లో మాత్రమం టీడీపీ ఒత్తిళ్లు పనిచేయలేదు. విద్యార్థుల తల్లిదండ్రులు తిరగ పడడంతో నాయకులు వెనుతిరిగి వెళ్లారు. ఎస్‌ఐను పంపించారు.ఎస్‌ఐ విద్యాసాగర్ తల్లిదండ్రులను హెచ్చరించాలని చూసారు. అయినా ససేమిరా అనడంతో ఆయన వెళ్లిపోయాడు.


పాఠశాల వద్ద టీడీపీ నాయకులు

కమిటీలు గిమిటీలు జాంతానై..


గందరగోళంగా మారిన కమిటీ సభ్యుల సమావేశం

అట్లూరు : పాఠశాల యాజమాన్య కమిటీని విద్యార్థుల తల్లిదండ్రులు ఎన్నుకోవాల్సిఉంది. అయితే టీడీపీ నాయకులు చెప్పిన పేర్లే ఉపాధ్యాయులు రాసుకోవాల్సిన పరిస్థితి వైఎస్సార్ జిల్లా అట్లూరు మండలం కమలకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చోటు చేసుకుంది. గురువారం ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులను పాఠశాలకు పిలిపించారు. నిబంధనల ప్రకారం కమిటీ సభ్యులను ఎంపిక చేసుకున్నారు. కమిటీ సభ్యులు చిట్టిబోయిన కవితను చైర్మన్‌గా ఎంపిక చేశారు. ఇంతలో అదే గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు వడ్డమాను సుదర్శన్‌రావుతో పాటు మరి కొంతమంది సభ్యులు సమావేశంలోకి వెళ్లి కమిటీలు గిమిటీలు జాంతానై మేము చెప్పిన వారి పేరే చైర్మన్‌గా రాసుకోండి అంటూ హుకుం జారీ చేశారు. దీంతో ఏమీ చేయలేక కమిటీ సభ్యులు అందరూ ఇళ్లకు వెళ్లి పోయారు.గత్యంతరం లేక టీడీపీ నాయకుడు చెప్పిన మోపూరి పార్వతి పేరును చైర్మన్‌గా నమోదు చేసుకున్నారు. కమిటీ సభ్యుల సంతకాలు పాఠశాల రికార్డులు వారి ఇళ్లకు టీడీపీ నాయకులు తీసుకెళ్లి పెట్టించినట్లు తెలిసింది. ప్రధానోపాధ్యాయురాలు ప్రేమ కుమారిని వివరణ అడిగేందుకు ప్రయత్నించగా అందుబాటులో లేరు.

కల్లూరు ఎస్‌ఎంసీ ఎన్నిక రెండో రోజు వాయిదా


కల్లూరు జెడ్పీ హైస్కూల్

ప్రొద్దుటూరు: పట్టణంలో అధికార పార్టీని అడ్డం పెట్టుకుని టీడీపీ నేతలు అనేక గ్రామాల్లో తమ వర్గీయులను, వారి అనుచరులను ఎస్‌ఎంసీ చైర్మన్, వైస్ చైర్మన్, పాలక వర్గ సభ్యులుగా నియమించారు. వీలు కాని చోట పోటీ తప్పనిసరి అయింది. మండలంలోని కల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 224 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఈ పాఠశాలలో ఎస్‌ఎంసీ ఎన్నిక రెండో రోజు వాయిదా పడింది. కోరం లేని కారణంగా శుక్రవారం ఎన్నికలను వాయిదా వేశారు. వైఎస్సార్‌సీపీ వర్గీయుడు బీసీ సుబ్బయ్య, టీడీపీకి వర్గీయుడు బాలరాజు ఎస్‌ఎంసీ ఎన్నికల్లో పోటీ పడ్డారు. నిబంధనల ప్రకారం గురువారం ఎన్నికలు జరగాల్సి ఉంది. అయితే కోరం లేని కారణంగా వాయిదా వేశారు. టీడీపీ వర్గీయులు విద్యార్థుల తల్లిదండ్రుల వద్దకు వెళ్లి మీరు కచ్చితంగా తమకే ఓటు వేయాలని, లేకుంటే పింఛన్ తోపాటు ఇతర సంక్షేమ పథకాలను తొలగిస్తామని బెదిరించినట్లు సమాచారం.

మండలంలోని రామాపురం ప్రాథమిక పాఠశాల ఎస్‌ఎంసీ ఎన్నికలు ప్రతిష్టాత్మకంగా జరిగాయి. టీడీపీ, వైఎస్సార్‌సీపీ వర్గీయులు బలంగా పోటీపడ్డారు. ఒకానొక దశలో ఈ ఎన్నికలను నిలుపుదల చేయాలని టీడీపీ నేతలు ఉన్నతాధికారులపై ఒత్తిడి తెచ్చారు. ఉపాధ్యాయులు నిబంధనల ప్రకారం ఎన్నికలు నిర్వహించారు. స్కూల్ మేనేజ్ మెంట్ కమిటీ చైర్మన్‌గా పత్తూరు ఓబన్న, వైస్ చైర్పర్సన్‌గా సత్యవతిని ఎన్నుకున్నారు.

ఇద్దరు సీఐల బదిలీ

కడప అర్బన్ : వైఎస్‌ఆర్ జిల్లాలో పనిచేస్తున్న ఇద్దరు సీఐలను బదిలీ చేస్తూ అనంతపురం డీఐజీ డాక్టర్ షేముషి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. కడపలోని సైబర్ క్రైమ్ విభాగంలో సీఐగా పనిచేస్తున్న వి. శ్రీధర్‌నాయుడును చిత్తూరు వెస్ట్ సర్కిల్ సీఐగా బదిలీ చేశారు. కడప సీసీఎస్-2 సీఐగా పనిచేస్తున్న ఎం. రాంభూపాల్‌ను పుంగనూరు రూరల్ సర్కిల్ (చౌడేపల్లి) సీఐగా నియమించారు.

రూ. 77 కోట్ల వేతనాల పెండింగ్

కడప సిటీ : జిల్లాలో ఉపాధి హామీ పనులకు సంబంధించి కూలీలకు దాదాపు 77 కోట్ల రూపాయల వేతనాలు పెండింగ్‌లో ఉన్నట్లు అధికారులు తెలిపారు. కూలీల ఖాతాల్లో సోమవారం ఈ మొత్తం ప్రభుత్వం జమ చేయనుందని చెబుతున్నారు. వ్యవసాయ పనులు లేక గ్రామీణ ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వేతనం ఇవ్వకపోవడంతో దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ఎన్నికల కోడ్ అడ్డంకి కాకపోయినప్పటికీ మే 21వ తేదీ నుంచి దాదాపు 80 రోజులుగా వేతనాలు జమ కాలేదని కూలీలు చెబుతున్నారు. తమకు వెంటనే వేతనాలు మంజూరు చేయాలని వారు కోరుతున్నారు.

ఐదుగురు చిన్నారులకు జ్వరం


వైద్య సేవలు పొందుతున్న చిన్నారులు

కమలాపురం : పట్టణంలోని తూర్పు గండ్లూరు కాలనీలో ఐదుగురు చిన్నారులు జ్వరం బారిన పడ్డారు. ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా.. అక్కడి వైద్యులు పరీక్షించి డెంగీఅని నిర్ధారించారు. కాలనీలోని ఇతర పిల్లలకు డెంగీ సోకకుండా వైద్య శిబిరాలు ఏర్పాటుచేసి చికిత్స అందించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. వైద్యులు మాట్లాడుతూ వాతారణంలోని మార్పుల నేపథ్యంలో కాచి చల్లార్చిన నీటినే తాగాలన్నారు. జాగ్రత్తలు పాటించి రోగాలకు దూరం కావాలని వైద్యులు తల్లిదండ్రులకు సూచించారు.

క్లుప్తంగా

పేకాటరాయుళ్ల అరెస్టు

కొండాపురం : మండలంలోని చౌటిపల్లె పునరావాస కాలనీ సమీపంలో కంప చెట్లల్లో పేకాడుతుండగా ఆరుగురిని అరెస్టు చేసినట్లు కొండాపురం ఎస్‌ఐ విద్యాసాగర్ తెలిపారు. వారి నుంచి రూ.30, 680 నగదు స్వాధీనం చేసుకున్నారు.

జిల్లా కార్యదర్శిగానియామకం


నియామకపత్రం అందజేస్తున్న శశిభూషణ్‌రెడ్డి

ప్రొద్దుటూరు : బీజేవైఎం జిల్లా కార్యదర్శిగా ప్రొద్దుటూరుకు చెందిన అర్కటవేముల పృథ్వీనారాయణను నియమించారు. కడప బీజేపీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు శశిభూషణ్ రెడ్డి ఆయనకు శుక్రవారం నియామకపత్రం అందజేశారు. కార్యక్రమంలో అర్కటవేముల హరినారాయణ, పర్లపాడు గౌరీశంకర్, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

భార్య కాపురానికి రాలేదని భర్త ఆత్మహత్య


మృతి చెందిన వీరప్రతాప్

ఎర్రగుంట్ల : తన భార్య కాపురానికి రాలేదని భర్త ఆత్మహత్య చేసుకున్న సంఘటన శుక్రవారం జరిగింది. యర్రగుంట్ల సీఐ నరేషబాబు వివరాల మేరకు.. యర్రగుంట్ల పట్టణంలోని శాంతినగర్ కాలనీలోని మల్లెల హిమాంబీ దర్గా వీధిలో నివాసం ఉండే మంగపట్నం వీరప్రతాప్ (23) శుక్రవారం ఇంటిలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. చనిపోయిన వ్యక్తికి ఇద్దరు సంతానం. ఇంట్లో గొడవలతో ఈయన భార్య హిమాంబీ ఇటీవల పుట్టింఇకి వెళ్లింది. కాపురానికి రాకపోవడంతో మనస్తాపానికి గురైన అతడు ఇంట్లో ఉరి వేసుకుని మృతిచెందినట్లు తెలిపారు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకోని దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

బెంగళూరులో మహిళపై దాడి


రక్తపు మడుగులో సునీత

యశవంతపుర : బెంగళూరులో మహిళలపై దాడులు ఆందోళన కలిగిస్తున్నాయి. ఇంటా బయటా భద్రత లేకుండా పోతోందనే విమర్శలున్నాయి. రోడ్డుపై వెళుతున్న మహిళపై పిచ్చివాడు దాడి చేసిన ఘటన బెంగళూరులో జరిగిన ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. పోలీసుల వివరాల మేరకు.. వైఎస్సార్ జిల్లా కడప నగరానికి చెందిన సునీత (40) ఇద్దరు పిల్లలతో కలిసి కొడిగెనహళ్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని సహకార నగరలో నివాసముంటోంది. భర్త దుబాయ్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. సునీత గురువారం సాయంత్రం హికింగ్ చేస్తుండగా మతిస్థిమితం లేని ఓ వ్యక్తి వెనుక నుంచి వచ్చి తలపై బండరాయితో బాదాడు. తల నుంచి తీవ్ర రక్తస్రావమై ఆమె అక్కడికక్కడే కుప్పకూలింది. స్థానికులు దుండగున్ని పట్టుకొని చితకబాది బాధితురాలిని ఆస్పత్రికి తరలించారు. ఆమె పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. నిందితున్ని గోపాల్‌గా గుర్తించాం, అతడు విచారణకు సహకరించడం లేదని పోలీస్ కమిషనర్ దయానంద తెలిపారు.

ఉత్సాహంగా అండర్-19 క్రికెట్ టోర్నీ

కడప స్పోర్ట్స్ : కడప నగరంలో ఏసీఏ అండర్-19 అంతర్ జిల్లాల క్రికెట్ టోర్నమెంట్ ఉత్సాహంగా సాగుతోంది. వైఎస్ రాజారెడ్డి-ఏసీఏ మైదానంలో జరిగిన మ్యాచ్‌లో కడప జట్టు 77.1 ఓవర్లలో కడప జట్టు 259 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కృష్ణా జట్టు వికెట్ కోల్పోకుండా 23 పరుగులు చేసింది.

కేఎస్‌ఆర్‌ఎం మైదానంలో..

కేఎస్‌ఆర్‌ఎం మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో టాస్ గెలిచిన నెల్లూరు జట్టు 85.2 ఓవర్లలో 331 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. విశాఖ బౌలర్ రచిత్ 5 వికెట్లు తీశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన విశాఖ జట్టు తొలి రోజున 2 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 16 పరుగులు చేసింది.

కేఓఆర్‌ఎం మైదానంలో..


5 వికెట్లు తీసిన బౌలర్ రచిత్

కేఓఆర్‌ఎం మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో టాస్ గెలిచిన పశ్చిమ గోదావరి జట్టు 74.4 ఓవర్లలో 231 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన శ్రీకాకుళం జట్టు తొలిరోజు ఆట ముగిసే సమయానికి 12 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 58 పరుగులు చేసింది.

ప్రొద్దుటూరు నుంచి బెంగుళూరుకు రైలు అవసరం

రైల్వే మంత్రికి ఎంపీ వైఎస్.అవినాష్‌రెడ్డి వినతి


వినతిపత్రం సమర్పిస్తున్న ఎంపీ వైఎస్.అవినాష్‌రెడ్డి

కడప సెవెన్‌రోడ్స్ : ప్రయాణికుల అవసరాల నిమిత్తం వైఎస్సార్ జిల్లా నుంచి బెంగళూరుకు కొత్త రైలు ప్రవేశపెట్టాలని కడప ఎంపీ వైఎస్.అవినాష్ రెడ్డి కోరారు. కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌ను కలిసి శుక్రవారం వినతిపత్రాన్ని సమర్పించారు. ప్రొద్దుటూరు నుంచి గుత్తి, ఎర్రగుంట్ల, ముద్దనూరు, కొండాపురం, తాడిపత్రి మీదుగా బెంగళూరుకు రైలును ప్రవేశ పెట్టాలని కోరారు. నంద్యాల మీదుగా బెంగళూరుకు ప్రస్తుతం మూడు రైళ్లు వెళుతున్నాయని, కొండవీడు ఎక్స్‌ప్రెస్ మచిలీపట్నంలో బయలుదేరి నంద్యాల, గుత్తి మీదుగా బెంగళూరు వెళుతోందని, దీనిని నంద్యాల నుంచి బనగానపల్లె, కోవెలకుంట్ల, జమ్మలమడుగు, ప్రొద్దుటూరు, ఎర్రగుంట్ల, ముద్దనూరు, కొండాపురం, తాడిపత్రి, గుత్తి మీదుగా వెళ్లేలా చర్యలు చేపట్టాలని కోరారు. ఈ మార్గంలో అనేక సిమెంటు పరిశ్రమలు ఉన్నాయని, కొత్త రైలు ప్రవేశపెట్టడమో లేదా కొండవీడు ఎక్స్‌ప్రెస్‌ను పొడిగించడమో చేయాలని విజ్ఞప్తి చేశారు. కడప-బెంగుళూరు రైల్వే మార్గంలో 28 కిలోమీటర్ల మేర మాత్రమే పనులు జరిగాయని, పెండ్లిమర్రి నుంచి పుట్టపర్తి వరకు అలైన్‌మెంట్‌ను మార్చాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిపాదన పంపిందన్నారు. కడప-బెంగుళూరు రైల్వే లైన్ పనులు వేగవంతం చేయాలని కోరారు.

రైతు సంఘాల నిరసన


అంబేడ్కర్ సర్కిల్‌లో నిరసన తెలుపుతున్న వామపక్ష నాయకులు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : దేశ వ్యాప్తంగా కార్పొరేట్ కంపెనీల నుంచి వ్యవసాయాన్ని కాపాడాలని వామపక్ష కార్మిక, రైతు సంఘాల నాయకులు నాగసుబ్బారెడ్డి, దస్తగిరిరెడ్డి పేర్కొన్నారు. నగరంలోని అంబేద్కర్ సర్కిల్‌లో శుక్రవారం క్విట్ కార్పొరేట్ ఇండియా నిరసన చేట్టారు. వారు మాట్లాడుతూ అంబానీ,అదానీ లాంటి కార్పొరేట్ కంపెనీల నుండి రైతుల వ్యవసాయాన్ని కాపాడాలని డిమాండ్ చేశారు. కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోర్డులను రద్దు చేయాలని కోరారు. పంటల బీమా పథకాన్ని కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టడంతో ప్రీమియంలో 80 శాతం దోచేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజలపై పన్నుల భారం తగ్గించి ప్రభుత్వ ఆదాయం కోసం కార్పొరేట్ కంపెనీలపై భారం వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసులురెడ్డి, సుబ్బారెడ్డి, అన్వేష్, బాదుల్లా వెంకటసుబ్బయ్య చంద్రారెడ్డి మద్దిలేటి, గోపాలకృష్ణయ్య బాలచంద్రయ్య, యానాదయ్య, తదితరులు పాల్గొన్నారు.

కంప్యూటరీకరణతో మెరుగైన సేవలు

– డీసీసీ బ్యాంకు పర్సన్ ఇన్‌ఛార్జి, జేసీ అదితిసింగ్

కడప అగ్రికల్చర్ : జిల్లా సహకార కేంద్ర బ్యాంకును అభివృద్ధి పథంలో నడిపించేందుకు అధికారులు, సిబ్బంది కలిసి కట్టుగా కృషిచేయాలని డీసీసీ బ్యాంకు పర్సన్ ఇన్‌ఛార్జి, జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ అన్నారు. కడప డీసీసీ బ్యాంకు సమావేశ మందిరంలో సీఈఓ రాజామణి అధ్యక్షతన శుక్రవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. జేసీ అదితిసింగ్ మాట్లాడుతూ సహకార సంఘాల కంప్యూటరీకరణ సెప్టెంబర్ ఆఖరుకు పూర్తిచేయాలని సూచించారు. అనంతరం మొబైల్ బ్యాకింగ్ యాప్‌ను ఆమె ఆవిష్కరించారు. సీఈఓ రాజామణి మాట్లాడుతూ 2023-24 ఆర్థిక సంవత్సరంలో బ్యాంకు రూ.10.80 కోట్లు నికరలాభం ఆర్జించినట్లు తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని సహకార సంఘాలకు ఎరువుల వ్యాపారం, జన ఔషధి, గోదాములు, షాపింగ్ కాంప్లెక్స్‌ల నిర్మాణానికి తక్కువ వడ్డీకి రుణం ఇస్తారన్నారు. బ్యాంకు 2023-24లో ఉత్తమ ఫలితాలు సాధించినందుకు సిబ్బందికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు. అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

చెప్పిన మాట వినలేదని వివాహిత ఆత్మహత్య

ముద్దనూరు: మండలంలోని ఉమ్మారెడ్డిపల్లె గ్రామంలో వివాహిత వంగల అంజలి(29) ఆత్మహత్యకు గురయ్యారు. ఎస్‌ఐ మైనుద్దీన్ సమాచారం మేరకు.. సింహాద్రిపురం మండలం నక్కలపల్లెకు చెందిన అంజలికి ఉమ్మారెడ్డిపల్లెకు చెందిన నరసింహారెడ్డితో నాలుగేళ్ల కిందట వివాహమైంది. అంజలికి.. ఆమె ఆడపడుచు నాగేశ్వరి మధ్య మనస్పర్థలు ఉన్నాయి. ఉమ్మారెడ్డిపల్లెలో జరిగిన ఓ వివాహానికి గురువారం వచ్చిన నాగేశ్వరితో మాట్లాడవద్దని అంజలి తన భర్తకు చెప్పింది. అయినా ఆయన మాట్లాడడంతో కోపంతో గురువారం రాత్రి ఇంట్లోకి వెళ్లి అంజలి తలుపులు వేసుకుంది. కుమారుడు ఏడుస్తున్నా బయటికి రాకపోవడంతో భర్త వెళ్లి చూసేసరికి ఉరికి వేలాడుతూ విగతజీవిగా కనిపించింది. అంజలి తలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

అధికారుల విధులను అడ్డుకున్న టీడీపీ నేతలు

- నిషేధిత ప్లాసిక్‌ను సీజ్ చేయొద్దంటూ హుకూం
- పోలీసుల జోక్యంతో కేసు నమోదు


షాప్‌ను సీజ్ చేస్తున్న అధికారులు

ప్రొద్దుటూరు : వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరు మున్సిపాలిటీ పరిధిలో నిషేధిక ప్లాస్టిక్ వ్యాపారులు ఉన్నట్లు గుర్తించిన మున్సిపల్ అధికారులు శుక్రవారం దాడులు నిర్వహించి సీజ్ చేసే ప్రయత్నం చేశారు. కోనేటి కాల్వ వీధిలోని హోల్‌సేల్ వ్యాపారి సుబ్బయ్య గోదాముపై దాడులు జరిపారు. టీడీపీ నాయకులు గంటసాల వెంకటేశ్వర్లు, ఖలీల్ అధికారుల విధులకు అడ్డు తగిలారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం నిషేధిత జాబితాలోని ప్లాస్టిక్ వస్తువులను అమ్మరాదని తెలిపినా వారు పట్టించుకోకుండా వింత వాదన చేశారు. అగర బత్తీలకు ప్లాస్టిక్ పేపర్ ఉండదా? వాటర్ బాటిళ్లను ఎలా అమ్ముతున్నారు.. మైసూర్ శాండిల్ సోప్‌కు కవర్ ఉండదా అని ఎదురు ప్రశ్నించారు. అవి నిషేధిత జాబితాలో లేవని, ప్రభుత్వం నిషేధించిన వస్తువులను మాత్రం అమ్మకూడదని అధికారులు తెలిపారు. వ్యాపారి సుబ్బయ్య తమకు అనుకూలమని, మీరు ఇక్కడి నుంచి వెళ్లిపోవాలని టీడీపీ నేతలు వాగ్వాదానికి దిగారు. చివరికి అధికారులు మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డికి ఫోన్ చేయడంతో ఆయన వన్ టౌన్ పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు రావడంతో టీడీపీ నేతలు వెళ్లిపోయారు. సుమారు వంద కిలోల ప్లాస్టిక్ వస్తువులను సీజ్ చేసినట్లు మున్సిపల్ అధికారులు తెలిపారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ వంకం సుబ్బరాయుడు, డివిజన్ పరిధిలోని శానిటరీ సక్రటరీలు శ్రీనివాసులరెడ్డి, కరుణశ్రీ, హుస్సేన్, రామచంద్ర, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మట్కా, క్రికెట్ బెట్టింగ్‌పై నిఘా


టూటౌన్ పోలీస్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

ప్రొద్దుటూరు క్రైం : మట్కా, క్రికెట్ బెట్టింగ్, గ్యాంబ్లింగ్ జరగకుండా గట్టి నిఘా పెట్టాలని ఎస్పీ హర్షవర్ధన్‌రాజు తెలిపారు. ప్రొద్దుటూరు పోలీస్ స్టేషన్ ఎదుట ఎస్పీ శుక్రవారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. రికార్డులను పరిశీలించి నేరాల వివరాలను సీఐలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జరిగిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ పసిడిపురిగా పేరొందిన ప్రొద్దుటూరులో బంగారు అక్రమ రవాణా జరగకుండా చర్యలు చేపట్టాలన్నారు. గంజాయి నిర్మూలనకు నిర్దేశించిన వంద రోజుల ప్రణాళిక తప్పనిసరిగా అమలుచేయాలన్నారు. ప్రొద్దుటూరు సబ్ డివిజన్ పరిధిలో జరిగే అసాంఘిక కార్యకలాపాలను ఉక్కుపాదంతో అణచివేయాలన్నారు. నూతనంగా అమల్లోకి వచ్చిన భారతీయ న్యాయ సంహితపై అవగాహన పెంచుకోవాలని ఎస్పీ సూచించారు. ఫిర్యాదుదారులతో గౌరవంగా మాట్లాడి అత్యంత ప్రాధాన్యం కింద వారి సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు. నేరాల కట్టడికి సీసీ కెమెరాల నిఘా పెంచాలని సూచించారు. చోరీలు జరగకుండా రాత్రి, పగలు పోలీసు గస్తీ ముమ్మరం చేయాలన్నారు. కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ ఇన్స్‌పెక్టర్ వెంకట కుమార్, రూరల్ సీఐ రమణారెడ్డి, టూటౌన్ సీఐ యుగంధర్, వన్‌టౌన్ సీఐ శ్రీకాంత్, రాజుపాళెం ఎస్‌ఐ తులసి నాగప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

రాజుపాళెం పోలీస్ స్టేషన్ తనిఖీ

రాజుపాళెం : రాజుపాళెం పోలీస్ స్టేషన్‌ను ఎస్పీ వి.హర్షవర్ధన్‌రాజు శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్‌లో రికార్డులు, ఆవరణాన్ని పరిశీలించారు. ఫిర్యాదుదారులతో గౌరవంగా మాట్లాడి వారి సమస్యలను తెలుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ తులసీనాగ ప్రసాద్, ఏఎస్‌ఐలు రామకృష్ణారెడ్డి, సిద్ధయ్య, పోలీసులు పాల్గొన్నారు.